ఆహ్వానం



కూన శ్రీశైలంగౌడ్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కుత్బుల్లాపూర్: ఆలయాల అభివృద్ధి కోసం పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారంలోని శ్రీశ్రీశ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహా స్వామి జయంతి ఉత్సవాలకు హాజరు కావాలని ఆలయ కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఇంద్రసేనా గుప్త, యాదగిరి, నర్సింహారెడ్డి, సురేశ్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలు



సామూహిక కంకుమార్చనలో పాల్గొన్న మహిళలు

కుత్బుల్లాపూర్: శ్రీ కన్యకా పరమేశ్వరి జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. వాసవిక్లబ్ సుచిత్ర సర్కిల్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఆలయంలో అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ ప్రతినిధులు తోట భిక్షపతి, ఉప్పల నాగరాజు, మాశెట్టి శివ కుమార్, గోళి యోగేశ్వర్, పల్లా నాగరాజు, గుండా ఈశ్వర్‌రాజ్, రాంపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేటర్ రావుల శేషగిరి

సుభాష్‌నగర్: గాజులరామారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కార్పొరేటర్ రావుల శేషగిరి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, ఆర్యవైశ్య సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు ప్రారంభం



షాపూర్‌నగర్ రిజర్వాయర్ వద్ద తవ్వకాలు చేపడుతున్న దృశ్యం

చింతల్: షాపూర్‌నగర్ రిజర్వాయర్ ఆవరణలోని శిథిలావస్థకు చేరిన స్టోరేజీ ట్యాంక్ మరమ్మతుల పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ట్యాంక్ పైకప్పు శిథిలావస్థకు చేరడంతో దాని మరమ్మతుల్లో భాగంగా పైపులైన్‌లు వేసేందుకు జేసీబీతో తవ్వకాలు చేపట్టారు.

'కాఫీ టేబుల్ బుక్' ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పూర్తి సమాచారాన్ని తెలియజేసే కాఫీ టేబుల్ బుక్‌ను వీసీ ప్రొ.రవీందర్ ఆవిష్కరించారు. శనివారం పాలన భవనంలోని సెనెట్ హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్ బుక్ ప్రాధాన్యతను వివరించి ఆవిష్కరించారు. వివిధ పనుల కోసం ఓయూను సందర్శించే వారి కోసం వీసీ చాంబర్‌తో పాటు రిజిస్ట్రార్ ఇతర అధికారులు, ప్రిన్సిపల్స్ కార్యాలయాల్లోని టేబుళ్లపై కాఫీ బుక్‌ను అందుబాటులో ఉంచుతారు. ఓయూను పర్యవేక్షించేందుకు వస్తున్న యూజీసీ న్యాక్, ఇతర సంస్థల అధికారుల బృందానికి సైతం ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఎగ్జామినేషన్ కంట్రోలర్ ప్రొ.రాములు, ప్రింటింగ్ ప్రెస్ మాజీ డైరెక్టర్ విశ్రాంత అధ్యాపకులు ప్రొ.స్టీవెన్ సన్, పీఆర్వో ప్రొ.ప్యాట్రిక్, ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలి

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్లపై సదస్సు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఛత్తీస్‌గఢ్‌లో జరుగుతున్న ఆదివాసీల హత్యకాండా, మావోయిస్టుల బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టాలని తెలంగాణ పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శనివారం సుందయ్య విజ్ఞాన కేంద్రంలో పౌర హక్కుల సంఘం తెలంగాణ, ప్రజాస్వామిక హక్కుల సంఘాల సమన్వయ సంస్థ సంయుక్తాధ్వర్యంలో దండకారణ్యంలో మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ.. సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాట్లాడుతూ.. ఓ వైపు శాంతి చర్చలు అంటూనే మరోవైపు ఆదివాసీలను శవాలుగా మారుస్తూ.. గుర్తించేందుకు వీలు లేకుండా హత్య చేస్తున్నారని వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ కవి కె.శివారెడ్డి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకురాలు జి.అనురాధ, ప్రొఫెసర్ హరగోపాల్, వేణుగోపాల్, నారాయణరావు, చంద్రశేఖర్, సీపీఐఎంఎల్ న్యూడెమాక్రసీ రాష్ట్ర నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ప్రజాగాయని విమలక్క, సామాజిక కార్యకర్త సజయ, రైతు సామాజికవేదిక నాయకులు కన్నెగంటి రవి, మల్లేపల్లి ప్రభాకర్, వివిధ సంఘాల నేతలు క్రాంతి, డీజీ నర్సింహ్మారావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

వారు కళ్లు మూసుకుంటారు.. వీరు కన్నేస్తారు!

- కబ్జాదారుల ఆక్రమణలతో కుంచించుకుపోతున్న నాలాలు
- పట్టించుకోని అధికారులు
- చిన్నపాటి వర్షాలకే కాలనీలు జలమయం
- కనిపించని రక్షణ గోడలు
- అక్రమ నిర్మాణాలపై చర్యలు శూన్యం





అక్రమ నిర్మాణాలతో కుంచించుకుపోతున్న నాలా



ఆల్విన్‌కాలనీ: అధికారులు కళ్లు మూసుకుంటారు.. కబ్జాదారులు కన్నేస్తారు.. అంతే... నాలా లేవో కబ్జాలకు గురవుతాయి. రోజురోజుకూ కుంచించుకుపోతాయి. వర్షాలు వచ్చినప్పుడు పొంగిపొర్లుతాయి. జనం నీట మునిగి అల్లాడిపోతారు. ఇదీ కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో గొలుసుకట్టు చెరువులకున్న నాలాల దుస్థితి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు, ప్రజాప్రతినిధులు నాలాలకు ఇరువైపులా కంచెగోడలు ఏర్పాటు చేసి కబ్జా కాకుండా చూడాల్సిన అధికారులు వాటిపై కన్నెత్తి చూడటంలేదు. ఇదే అదనుగా భావించిన కబ్జాదారులు నాలాల ఇరువైపులా భారీ అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఆమ్యామ్యాలు అందటంతోనే అక్రమ నిర్మాణాలను పట్టించుకోకుండా చోద్యం చూడటంతో నాలాలు అన్యాక్రాంతం అవుతున్నాయని స్థానిక సంక్షేమ సంఘాల సభ్యులు వాపోతున్నారు.

ఈ చెరువుల కింది నాలాలు ఇంతేనా...

ప్రగతినగర్ అంబీర్ చెరువు, కిందికుంట చెరువు, పరికి చెరువు, ఎల్లమ్మ చెరువు, ప్రాంతాల్లోని నాలాలు కుంచించుకుపోవటంతో చెరువులోని నీటితోపాటు వరదనీరు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నీరు సాఫీగా ప్రవహించడంలేదు. దీంతో భారీవర్షాలు కురిస్తే ఆ చుట్టుపక్కల ఉన్న కాలనీలన్ని నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. గత వర్షాకాలంలో ప్రగతినగర్ అంబీర్ చెరువు పరిసర ప్రాంతాలు, పరికి చెరువు పరిసర ప్రాంతాల్లోని ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, చక్రధర్ నగర్ కాలనీ వంటి తదితర కాలనీలో నీట మునిగాయి. బోట్లను వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

చేతులు దులుపుకున్నారు అంతే..

ప్రజా ప్రతినిధులు ఈ ప్రాంతాల్లో నీట మునిగిన వారిని పరామర్శించి చేతులు దులుపుకున్నారు. కానీ, వారి సమస్యను పరిష్కరించలేదు. చెరువుల నాలాలకిరువైపులా కంచె గోడలు లేకపోవటం, నాలాలకు ఇరువైపులా ఉన్న ఖాళీ స్థలాలను ఆక్రమించి కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు చేపట్టి అమాయక ప్రజలకు అంటగట్టి కోట్లను ఆర్జిస్తున్నారు. వర్షాకాలంలో వరద నీటితో ఈ ప్రాంతాలు నీట మునిగి ప్రాణాలు అరచేత పట్టుకొని గడపాల్సి వస్తుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు అవసరం...

ఆల్విన్‌కాలనీ, ధరణినగర్, సాయినగర్, ఆదిత్యనగర్, వివేకానందనగర్, కమల ప్రసన్న నగర్, వేంకటేశ్వరనగర్, శ్రీనివాస నగర్, రామ్‌నరేష్ నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ, వంటి ప్రాంతాల్లో ప్రవహిస్తున్న నాలాలకు ఇరువైపులా ఉన్న అక్రమ నిర్మాణాలు గుర్తించి వారిపై చర్యలు తీసుకొని నాలాలకు ఇరువైపులా కంచె గోడలు ఏర్పాటు చేయాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

సరిహద్దులు ఏర్పాటు చేయాలి



నాలాలకు ఇరువైపులా సరిహద్దులు ఏర్పాటు చేసి కంచె గోడలు నిర్మించాలి. కబ్జాలకు గురవుతున్న నాలా ప్రాంతాలను పరిశీలించి అధికారులు, ప్రజాప్రతినిధులు వాటిని తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలి. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ప్రమాదం జరగక ముందే జాగ్రత్త చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–సూర్యవంశి ప్రలిత్, స్థానికుడు

బ్రెయిన్ స్ట్రోక్ బాధితుడికి చేయూత



నిత్యవసరాలు అందజేసిన మీ కోసం ఫౌండేషన్ సభ్యులు

సుభాష్‌నగర్: బ్రెయిన్‌స్ట్రోక్‌తో మంచానికి పరిమితమైన ఓ వ్యక్తికి 'మీ కోసం'ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. సూరారం కాలనీకి చెందిన రాజేందర్‌కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఏ పనీ చేయలేక ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో కుటుంబ పెద్దదిక్కు మంచానపడటంతో ఆ కుటుంబసభ్యులకు పూట గడవమే కష్టతరంగా మారింది. రాజేందర్ కుటుంబ సభ్యులు మీ కోసం ఫౌండేషన్ చైర్మన్ కట్టబోయిన శివకుమార్ యాదవ్‌ను సంప్రదించి దీనస్థితిని వివరించారు. దీనిపై స్పందించిన ఆయన శనివారం సంస్థ సభ్యులు లిల్లీసింగ్, స్రవంతితో కలిసి మూడు నెలలకు సరిపడా నిత్యవసరాలు అందజేశారు. రాజేందర్ మందులకు అయ్యే ఖర్చులను భరించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

త్వరలో తెలుగులో సాఫ్ట్‌వేర్ సొల్యూషన్

స్వేచ్ఛ వ్యవస్థాపకులు కిరణ్ చంద్ర

గచ్చిబౌలి: త్వరలో తెలుగులో సాఫ్టవేర్ సొల్యూషన్‌ను అందుబాటులోకి తీసుకొస్తామని స్వేచ్ఛ వ్యవస్థాపకులు కిరణ్ చంద్ర పేర్కొన్నారు. డేటా సెట్‌ల ఆధారంగా తెలుగులో చాట్ జీపీటీని తలదన్నేలా ఒక సాఫ్ట్‌వేర్ సొల్యూషన్‌ను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు. శనివారం గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరుల సమావేశంలో 'సమ్మర్ ఆఫ్ ఏఐ'పై ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌పై ఇంటర్న్‌షిప్‌లో లక్ష మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని, మొదటి విడతలో పదివేల మందికి శిక్షణ ఇప్పటికే ప్రారంభమైందన్నారు. త్వరలో రెండో విడతలో 30 వేల మందికి, మూడో విడతలో 60 వేల మందికి శిక్షణ ఇస్తామన్నారు. తెలుగుభాష సంస్కృతి, జానపదాలు, కళారూపాలు, పాటలు, కథల రూపంలో నిక్షిప్తమై ఉంటుందన్నారు. వీడియోలు, టెక్స్ట్, వాయిస్ రూపంలో డేటా సెట్‌ను సేకరించి డాక్యుమెంట్లు తయారు చేస్తారని వివరించారు. శిక్షణ తీసుకున్న ఒక్కో విద్యార్థి తాతయ్యలు, అమ్మమ్మ, ఉత్పత్తి కార్మికుల నుంచి డేటా సేకరిస్తారని తెలిపారు. పలు సంస్థలు ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌లో సహకారం అందజేస్తాయని అన్నారు. తెలుగులో చాట్ జీపీటీ కోసం విద్యార్థులతో పాటు ఎవరైనా డేటా సెట్‌ను అందించవచ్చన్నారు.

నేడు హెచ్‌సీయూలో 'వైటథాన్-2024 రన్'

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఆదివారం ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో 'వైటథాన్-2024' రన్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. క్యాంపస్‌లో ఉదయం 5.45 గంటలకు ఈ రన్‌ను మాదాపూర్ డీసీపీ డాక్టర్ వినీత్, ఎల్‌వి ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ వ్యవస్థాపకుడు డాక్టర్ జీఎన్‌రావు కలిసి ప్రారంభిస్తారు. ఈ కార్యక్రమంలో ఎల్‌విప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ ఎగ్జిక్యూటివ్ చైర్ డాక్టర్ ప్రశాంత్‌గార్గ్, ఇన్‌స్టిట్యూట్ ఆపరేషన్ ఐసైట్ యూనివర్సిల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఐ క్యాన్సర్ హెడ్ డాక్టర్ స్వాతి కల్కి, అపోలో క్యాన్సర్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ విజయ్ ఆనంద్‌రెడ్డి, హైదరాబాద్ రన్నర్స్ అధ్యక్షుడు అభిజిత్ పాల్గొంటారు.

నేడు ఉచిత ఆరోగ్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవం సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేడు ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో సీనియర్ ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్ శ్రీనివాస్, కంటివైద్యులు కులశేఖర్, నిలోఫర్ ఆస్పత్రి చిన్న పిల్లల వైద్యులు కేవీఎస్ నారాయణ, ఫ్యామిలీ ఫిజిషియన్ డాక్టర్లు శ్రీవర్ధన్, సుధీర్‌తో పాటు వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు. ఈ శిబిరంలో మధుమేహం, బీపీ, స్క్రీనింగ్ పరీక్షలతో పాటు నేత్ర, రక్త పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. పిల్లలకు ఆరోగ్య సంబంధమైన పరీక్షలు చేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాచుపల్లిలో విజేత సూపర్ మార్కెట్ ప్రారంభం



బాచుపల్లిలో విజేత సూపర్ మార్కెట్ నూతన బ్రాంచ్‌ను ప్రారంభిస్తున్న జగన్మోహన్‌రావు, తిరుపతిరెడ్డి

నిజాంపేట్: తెలుగు రాష్ట్రాల్లో విజేత సూపర్ మార్కెట్ ఒక బ్రాండ్‌గా నిలిచిందని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మురకొండ జగన్మోహన్‌రావు అన్నారు. శనివారం బాచుపల్లిలో విజేత సూపర్ మార్కెట్ 111వ శాఖను ఆయన టెక్నోపోలీస్ కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తిరుపతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జగన్మోహన్‌రావు మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందిస్తూ వారి మన్ననలు పొందామన్నారు. విజేత సూపర్‌మార్కెట్ అంటే ప్రజల్లో ఓ నమ్మకం ఏర్పడిందని, మున్ముందు సైతం ఇదే రీతిలో సేవలు కొనసాగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సందీప్ చౌదరి, మార్కెటింగ్ డైరెక్టర్ సిద్ధార్థ్, సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో సాగాలి

శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్



అధికారులతో సమావేశమైన వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్

గచ్చిబౌలి: భారీ వర్షాలకు ఐటీ కారిడార్‌లోని ప్రధాన రహదారులపై వరద నీటి తొలగింపులో అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ స్నేహ శబరిష్ అధికారులకు సూచించారు.శనివారం శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఐటీ కారిడార్‌లో వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వరద నివారణ చర్యలు, భారీ వర్షం వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జంక్షన్లలో విద్యుత్ స్తంభాల తొలగింపు, అడ్డుగా ఉన్న చెట్ల తొలగింపు, గ్రీన్ వేస్ట్‌పై సంబంధిత అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ డిప్యూటీ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, డీసీలు రజినీకాంత్‌రెడ్డి, వంశీకృష్ణ, సీపీ మల్లిఖార్జున్, ఇంజనీరింగ్, హెచ్‌ఎండబ్ల్యూస్, టీఎస్ ఎస్‌పీడీసీఎల్, శానిటేషన్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



అలరించిన నృత్యప్రదర్శన

మాదాపూర్: శిల్పారామంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా శనివారం సాయంత్రం కలర్స్ ఆర్ డ్యాన్స్ ఎస్ఎస్ఎల్ ప్రవీణ శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో అలరించారు. ఇందులో అంబపరాకు, పూర్వరంగం, వినాయకకౌతం, తాండవ నృత్యకరి, నమ శివాయతే, ఆనందనర్తన గణపతిమ్, చేరి యశోదకు, అచ్యుతం కేశవం, తిల్లాన, మంగళం తదితర అంశాలను కళాకారులు అక్షిత, అలివేణి,శివాలక్ష్మి, శాన్వి, అనన్య, కళ్యాణి, లావణ్య, ఆశ్రిత, శ్రీపాద, సహస్ర, మోక్షిత, జాహ్నవి తదితరులు ప్రదర్శించారు.

ముగిసిన సమ్మర్‌క్యాంపు

శిల్పారామంలో 15రోజుల పాటు నిర్వహించిన సమ్మర్‌క్యాంపు ముగింపు కార్యక్రమాన్ని ఎత్నిక్ హాల్‌లో నిర్వహించారు. వివిధ అంశాలలో శిక్షణ పొందిన 92మంది విద్యార్థులకు శిల్పారామం ప్రత్యేక అధికారి జి.కిషన్‌రావు సర్టిఫికెట్‌లను అందజేశారు.

అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించిన అన్నమయ్య స్వరార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం శ్రీసత్యకీర్తి నృత్యధామం శిష్యబృందం నృత్యార్చనతో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు. విష్ణు సహస్రనామం, లక్ష్మీఅష్టోత్తరం, అన్నమయ్య అష్టోత్తరంతో శ్రోతలను కళాకారులు ఆకట్టుకున్నారు. శ్రీసత్యకీర్తి నృత్యధామం గురువు బాలాజీ కుమార్ దొడ్ల శిష్యబృందం దశావతారం, రామాయణశబ్దం, భామాకలాపం తదితర కీర్తనలకు నృత్యరూపం ఇచ్చారు. కళాకారులు గీర్వాణి, వేద, శ్రీనిక, దుర్గా, వన్షిక పాల్గొన్నారు.





సెలవుల్లో సుకూన్ -24 నిర్వహించొద్దు

స్టూడెంట్ యూనియన్‌ను కోరిన హెచ్‌సీయూ యంత్రాంగం

రాయదుర్గం: సెలవులు ఉన్నందున సుకూన్-2024 ఫెస్టివల్‌ను నిర్వహించవద్దని స్టూడెంట్స్ యూనియన్‌కు హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ఉత్తర్వు జారీ చేసింది. యూనివర్శిటీ తెరిచి ఉన్నప్పుడు విద్యార్థుల పండగ సుకూన్‌ను నిర్వహించాలని సూచించారు.ఈ మేరకు శనివారం హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ఒక అత్యవసర ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం వెకేషన్ పీరియడ్ కావడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్ళినందున అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొన లేరని,అలాగే ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల కోడ్ జూన్ 4 వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ ప్రత్యేకంగా 13 ఆదేశాలను కూడా నిర్దేశిస్తూ ఒక ఉత్తర్వును జారీ చేశారు.దీనిని విధిగా పాటించాలని సూచించారు. విద్యార్థులందరూ క్యాంపస్‌కు తిరిగి వచ్చే తదుపరి సెమిస్టర్‌లో ప్రత్యామ్నాయ తేదీలను ప్రతిపాదించాలని శనివారం విడుదల చేసిన ప్రకటనలో హెచ్‌సీయూ అడ్మినిస్ట్రేషన్ అధికారులు పేర్కొన్నారు.

మజ్జిగ ప్రభాకర్‌కు ఘన నివాళి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లి మాజీ కార్పొరేటర్ మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ ముషీరాబాద్ బి-బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కు వద్ద ప్రభాకర్‌రెడ్డి మూడో వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

పుస్తకావిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ సెంటర్ ఫర్ ప్లాంట్ మాలిక్యూలర్ బయోలజీ (సీపీఎంబీ) డైరెక్టర్ డా.రామకృష్ణ రచించిన బయో మెడికల్ యాస్పెక్ట్స్ ఆఫ్ సాలిడ్ కేన్సర్స్ అనే పుస్తకాన్ని వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఎపిడెమియాలజీ, ప్రమాద కారకాలు, రోగ నిర్ధారణ, వర్గీకరణ, జన్యుశాస్త్రం, చికిత్స, ప్రస్తుత సవాళ్లు తదితర కేన్సర్ సంబంధిత వివిధ అంశాలను పుస్తకంలో పొందుపరిచినట్లు రామకృష్ణ తెలిపారు.

అసంపూర్తి పనులు.. అవస్థలు

రంగారెడ్డినగర్: అధికారుల అసంపూర్తి పనులను ప్రజలకు కొత్త కష్టాలు తెచ్చి పెడుతున్నాయి.. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఆదర్శనగర్‌లో ఇటీవల పలు అంతర్గత వీధుల్లో జలమండలి ఆధ్వర్యంలో డ్రైనేజీ లైన్‌లు వేశారు. అనంతరం జీహెచ్ఎంసీ నిధులతో రోడ్లు పూర్తి చేశారు. అయితే ప్రధాన రోడ్డుకు అనుసంధానంగా ఉన్న అంతర్గత రోడ్లును కలిపేలా సిమెంట్ వర్క్ చేయకుండా మట్టిపోసి అలాగే వదిలేశారు. దీంతో ఇటీవల కురుస్తున్న వర్షాలతో బురదమయంగా మారాయి. ఫలితంగా వాహనదారులు రాకపోకలు సాగించే సమయంలో వాహనచోదకులు జారిపడుతున్నారు. అంతర్గత రోడ్డు 18 మొదలుకుని పలు చోట్ల ఇదే పరిస్థితి. దీంతో వాహనదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతర్గత రోడ్లకు ప్రధాన రోడ్డును శాశ్వత ప్రాతిపదికన అనుసంధానం చేసి ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆదర్శనగర్‌లోని అంతర్గత రోడ్డు-18నుండి ప్రధాన రోడ్డు కలిసే చోట బురదమయంగా మారిన దృశ్యం